

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా

జాగ్రత్తలు తీసుకోవాలి

అధికారులకు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

వికారాబాద్, జూన్ 6 : ఎరువులు, విత్తనాల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం గ్రూప్-1 పరీక్ష, ఖరీఫ్ సీజన్ కార్యాచరణ, మిషన్ భగీరథ, అమ్మ ఆదర్శ పాఠశాలలు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి ప్రిన్సిపల్ సెక్రెటరీ శాంతికుమారి జిల్లా కలెక్టర్‌లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, విత్తనాల లభ్యతలో ఎలాంటి ఆటంకం కలుగకుండా ప్రతి మండలంలో ఇన్‌చార్జి అధికారులను నియమించాలన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను (యూనిఫామ్) జూన్ 10లోగా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. పట్టణ, గ్రామ పరిధిలోని విద్యార్థులకు 85,988 జతలు తయారీకి ఇవ్వడం జరిగిందని, ఇందులో 71,304 జతల బట్టల తయారీ పూర్తయిందన్నారు. ఇంకా 17 శాతం యూనిఫామ్‌లు రెండు రోజుల్లో పూర్తవుతాయని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణు కాదేవి, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, మెప్మా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలి

జిల్లా దివ్యాంగులకు సదరం క్యాంపునకు సంబంధించి జూన్ 7 (శుక్రవారం) ఉదయం 11 గంటల నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11, 13, 21, 27, 29 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధి మాంద్యత, చెవుడు, మూగ గల దరఖాస్తుదారులు హాజరుకావాలన్నారు. 10, 11, 18, 26 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే క్యాంపులకు అంగ వైకల్యం, అంధులు హాజరుకావాలని ఆయన తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఇంతకు ముందు పొంది సర్టి ఫికెట్ కాల పరిమితి అయిపోయిన వారితోపాటు, కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలన్నారు. ప్రస్తుతం 590 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ
- జిల్లాల అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్‌లు, జాయింట్ కస్టోడియన్‌లతో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అధికారులు

వికారాబాద్, జూన్ 6 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్‌లు, జాయింట్ కస్టోడియన్‌లతో జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు అన్ని వసతులను సిద్ధం చేశామన్నారు. టీజీపీఎస్‌సీ చైర్మన్ సూచనల మేరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్తు, టాయిలెట్స్, తాగునీరు ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్ష సమయంలో పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణ చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో బయోమెట్రిక్‌పై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర, టీజీపీఎస్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ రాజేశ్, కలెక్టరేట్ పరిపాలనా అధికారి అమరేందర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొలకరి పలకరింపుతో పొలం బాట

రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని వ్యవసాయాధికారుల సూచన

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 6 : రుతుపవనాల రాకతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. తొలకరి పలకరింపుతో అన్నదాతలు పొలం బాట పట్టారు. పంటలను సాగు చేసుకునేందుకు విత్తనాల కొనుగోళ్లు, పొలాలను సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా రైతులు మొక్కజొన్న, పత్తి, కందులతో పాటు ఇతర రకాల విత్తనాలను పెద్దఎత్తున వేసుకుంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఈ నెలాఖరు నాటికి పెసర్లు, మొక్కజొన్నలు వేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వరి నార్లను కూడా ఈ నెలాఖరు లోపు వేసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశముందన్నారు. వచ్చే నెల 15 నాటికి పత్తి విత్తనాలు వేసుకోవాలని, జులై 31 వరకు కందులు వేసుకోవాలని సూచించారు. ఆముదం పంటను ఆగస్టు 15 వరకు వేసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశముందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులను పొందాలని అధికారులు రైతులకు సలహాలిస్తున్నారు.

నాసి రకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

ప్రైవేటు వ్యాపారస్తులు విక్రయించే విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దు. నాసి రకం విత్తనాలు కొనుగోలు చేస్తే దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశముంది. నాసి రకం విత్తనాలు విక్రయించే వారి సమాచారమందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు ప్రభుత్వం గుర్తించిన ఐఎస్ఐ మార్కు ఉన్న విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులను పొందాలి. ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలు కొనుగోలు చేయడం మంచిది.

- శ్రవణ్‌కుమార్, ఏఈవో ఇబ్రహీంపట్నం

ఇంటర్ బోర్డును ప్రక్షాళన చేయాలి

ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయం ఎదుట ధర్నా చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా హామీ

సుల్తాన్‌బజార్, జూన్ 6 : అనధికార కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ఇంటర్ బోర్డు పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. గురువారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయం ఎదుట అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా అనధికార కళాశాలల్లో అడ్మిషన్లు, తరగతులు నిర్వహిస్తున్న అంశాలపై చేపట్టిన సర్వే నివేదికను ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వందలాది ఇంటర్ బోర్డు గుర్తింపు పొందని కళాశాలలు ఉన్నాయని, అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా మూడు జిల్లాల్లో 200కు పైగా జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డుకు విరుద్ధంగా నడుస్తున్నాయని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ కళాశాలల ఆగడాలను కట్టడిచేయాలని కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపడుతామని నిర్లక్ష్యం కనబర్చిన అధికారులపై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, మాజిద్, శేఖర్, కళ్యాణ్, విజయ్, బాలు, మహేశ్, శ్రీకాంత్, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫాంలు అందించేందుకు చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కు వివరించిన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 పరీక్ష నిర్వహణ, విద్యార్థులకు యూనిఫాంలను అందజేయడంపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, టీజీపీఏఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి తదితరులతో కలిసి జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎస్ ఈ సందర్భంగా సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ, అన్ని నివాస ప్రాంతాల్లో ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచి నీటి సరఫరా, కలెక్టరేట్ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించకుండా చూడడం తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల క్రతువును రాష్ట్రంలో ఎలాంటి లోటుపాట్లు, అపశృతులకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించడం పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లను, పోలీస్ కమిషనర్లను, ఎస్పీలను అభినందించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరుగనున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు అందించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 55,692 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయనుండగా, వారి కోసం 93 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాఫీగా నిర్వహించేలా, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లకు పరీక్షల నిర్వహణ విధులపై స్పష్టమైన అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా, తాగునీరు, అవసరమైన పక్షంలో వెంటనే ఫస్ట్ ఎయిడ్ చికిత్స అందించేలా ఏఎన్ఎంలను నియమించడం, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపేలా చర్యలు చేపడుతున్నామన్నారు. 144 సెక్షన్ అమలు చేస్తూ, ఎగ్జామ్ సెంటర్ల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయించేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూస్తామన్నారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్నాపత్రాలు, ఇతర సామగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించి, పరీక్ష ముగిసిన అనంతరం పూర్తి భద్రత నడుమ ఓఎంఆర్ షీట్లను స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చడం జరుగుతుందన్నారు. జిల్లాలో 46 శాతం యూనిఫాంలను తయారు చేయడం జరిగిందని తెలిపారు. జీహెచ్ఎంసీ, యూఎల్‌బీ పరిధిలో 16 యూఎల్‌బీఎస్‌లు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం 10వ తేదీ నాటికి 65 శాతం పూర్తవుతుందని.. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న వాటిని 11వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూనిఫాంలను సకాలంలో అందించాలి

స్కూల్ యూనిఫాంలను సకాలంలో అందించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టర్ గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సంబంధిత అధికారులతో స్కూల్ యూనిఫాంలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యూనిఫాంలను విద్యార్థులతో ట్రయిల్ చేయించి యూనిఫాంలో తేడాలుంటే సరిచేయాలని సూచించారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో యూనిఫాంలు కుట్టేలా పర్యవేక్షణ జరపాలన్నారు. మహిళా స్వయం సహాయక కేంద్రాల్లో యూనిఫాంల తయారీ పూర్తయిన వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందించాలన్నారు. ఇప్పటివరకు 49 శాతం మేర యూనిఫాంలు సిద్ధం చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ నెల 10లోగా యూనిఫాంలు ఆయా బడులకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా మెప్మా అధికారి మల్లీశ్వరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎఫ్ఆర్‌వో అరుణ

మొక్కలను అక్రమంగా తొలగించడం చట్టరీత్యా నేరం

వికారాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్

ధారూరు, జూన్ 6 : అటవీశాఖ భూముల్లో నాటిన మొక్కలను అక్రమంగా తొలగించడం నేరమని వికారాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. గురువారం ధారూరు పరిధిలోని దోర్నాల్ రిజర్వ్ ఫారెస్టులో నాటిన మొక్కలు, అటవీ భూములను వికారాబాద్ రేంజ్ అధికారి అరుణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. కొత్తగా సాగు చేయడానికి ప్రయత్నించి, అటవీ భూముల్లో ఉన్న చెట్లను అక్రమంగా తొలగించడం, అటవీ భూములను అక్రమించుకోవడం నేరమని తెలిపారు. అటవీ భూములను, చెట్లను, పర్యావరణాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజలపై ఉందన్నారు. మన ప్రాంతం.. మన పర్యావరణం.. మన జీవితం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులున్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు

పనులు వేగవంతం చేయాలి

- డీఈవో సుశీందర్‌రావు
- అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం

షాద్‌నగర్‌టౌన్, జూన్ 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని డీఈవో సుశీందర్‌రావు ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులకు సూచించారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ఎంఈవో శంకర్‌రాథోడ్‌తో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్న సందర్భంగా పాఠశాలల్లో మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ సదుపాయంతో పాటు రంగులు వేయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని, బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు వచ్చాయని, త్వరలో నోట్‌బుక్స్ కూడా వస్తాయని వివరించారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. మండల కేంద్రంలోని విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మండల నోడ్ అధికారులు రసూల్, లక్ష్మణ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సకాలంలో దుస్తులు అందించాలి

డీఆర్‌డీవో పీడీ శ్రీలత

కడ్తాల్, జూన్ 6 : విద్యార్థులకు సకాలంలో దుస్తులను అందించాలని డీఆర్‌డీవో పీడీ శ్రీలత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలోని కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఐకేపీ సభ్యులు దుస్తులు కుడుతున్న తీరును ఆమె పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలకు అనుకున్న సమయానికి బట్టలు కుట్టివ్వాలని సూచించారు. విద్యార్థులకు బట్టలు కుట్టడం ద్వారా ఐకేపీ సమాఖ్య సభ్యులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అనంతరం సభ్యులు కుట్టిన దుస్తులను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఏపీఎం రాజేశ్వరి, సీసీలు జరీనా, వసంత, రాములు, నర్సింహ, మల్లేశ్, ఆపరేటర్ విజయేందర్, వీవోఏలు లావణ్య, వనిత, శైలజ, వినోద్, ఛత్రు పాల్గొన్నారు.

ఐకేపీ సభ్యులు కుట్టిన దుస్తులను ప్రదర్శిస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత తదితరులు

నేటి నుంచి ఇండియా ఆర్ట్ ఫెస్టివల్

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : జూన్ 7 నుంచి 9 వరకు రేతిబౌలిలోని గుడిమల్కాపూర్ రోడ్డు మార్గంలో ఉన్న కింగ్స్ కొహినూర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ కొలువుదీరుతుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 250మంది కళాకారులు, 30 ఆర్ట్ గ్యాలరీలు, 3,500 కళా ఖండాలతో ఎగ్జిబిషన్ జరుగుతుందని తెలిపారు. జూన్ 7న ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఆర్ట్ ఫెస్టివల్ జూన్ 9న రాత్రి 8 గంటలకు ముగుస్తుందని వెల్లడించారు.

గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్ పాస్ జారీ

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ గురువారం గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్ పాస్ సేవలను ప్రారంభించింది. ఈ పాస్ ధర నెలకు రూ.1900 ఉంటుందని గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పాస్ ధర రూ.2530 ఉండగా రూ.630 తగ్గించామన్నారు.

టీఐఎఫ్ఆర్‌లో కెమికల్ పరిశోధనలు

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సెంటర్‌లో కెమికల్ పరిశోధనలకు ఆస్కారం ఇస్తున్నారు. పారిశ్రామిక అవసరాలకు విరివిగా వినియోగించే అరుదైన రసాయన సమ్మేళనాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో టీఐఎఫ్ఆర్‌లో రసాయన పరిశోధనలను ముమ్మరం చేయగా.. తాజాగా అతి సూక్ష్మ రసాయన పరమాణుల ప్రభావం రసాయనిక చర్యల్లో ఎలా ఉంటుందనే విషయాన్ని తెలుసుకునేందుకు పరిశోధనలు చేస్తున్నారు.

ఇద్దరు దారుణ హత్య

రక్తపుమడుగులో ఇద్దరు యువకుల మృతదేహాలు

మృతులది కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి గ్రామం

నిందితులను శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

కడ్తాల్, జూన్ 6 : ఇద్దరు యువకులను దారుణంగా హత్య చేసిన సంఘటన కడ్తాల్ సమీపంలోని వెంచర్‌లో గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు జల్కం రవి, మండల కేంద్రం సమీపంలోని బట్టర్‌ఫ్లై సిటీ వెంచర్‌లో ఓ విల్లాను అద్దెకు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు.

ఈ నెల 4న సాయంత్రం విల్లాలో రవి తన పుట్టిన రోజు వేడుకలను నాయకులు, తన మిత్రులతో కలిసి ఘనంగా జరుపుకొన్నాడు. జన్మదిన వేడుకలకు సంబంధించిన ఫొటోలను తన గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. పెద్దసంఖ్యలో ఫొటోలు వాట్సాప్ గ్రూప్‌లో రావడంతో గ్రామానికి చెందిన యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. ఈ క్రమంలో తన ఫొటోలను గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషగారి శివగౌడ్(27), గుండెమోని శివగౌడ్(25) గ్రూప్‌లో నుంచి తొలగించారనే నెపంతో, బుధవారం సాయంత్రం కడ్తాల్‌లో గల తన విల్లాకి వారిని రవి పిలిపించుకున్నట్లు సమాచారం. రవితో సన్నిహితంగా ఉండే వారిద్దరూ విల్లాకు వెళ్లినట్లు సమాచారం. అప్పటికే విల్లాలో ఉన్న జల్కం రవితోపాటు ఆమనగల్లు మున్సిపాలిటీలోని జంగారెడ్డిపల్లికి చెందిన బీజేవైఎం నాయకుడు పల్లె రాజుగౌడ్‌తో ఉన్నట్లు సమాచారం. నలుగురు మద్యం సేవిస్తున్న సమయంలో తన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో నుంచి ఎందుకు తొలగించారని జల్కం రవి.. గుండెమోని శివ, శేషగారి శివను ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఇద్దరు యువకులపై రవి, రాజుగౌడ్ పదునైన ఆయుధాలతో దాడి చేసి చంపి, విల్లాకు తాళం వేసి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం.

ఇదిలా ఉండగా గురువారం ఉదయం బటర్‌ఫ్లై సిటీ వెంచర్‌లోని విల్లాలో ఇద్దరు యువకులు హత్యకు గురైనట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విల్లా గేట్‌కున్న తాళాన్ని విరగ్గొట్టి లోపలికి వెళ్లిన పోలీసులు ఇద్దరు యువకులు హత్యకు గురైనట్లు గుర్తించారు. వెంటనే క్లూస్ టీంను పిలిపించి సాక్ష్యాధారాలను సేకరించారు. సంఘటనా స్థలాన్ని అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామి, సీఐలు శివప్రసాద్, ప్రమోద్‌కుమార్, రాంరెడ్డి, ఎస్ఐలు వరప్రసాద్, బలరాంనాయక్, కృష్ణ పరిశీలించి వివరాలు సేకరించారు. హత్యకు గురైన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. హత్యకు గురైన గుండెమోని శివగౌడ్ హైదరాబాద్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తుండగా, శేషగారి శివగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది.

ఈమేరకు కుటుంబ సభ